సాక్షి అనకాపల్లి

శనివారం । 30 । మార్చి । 2024



సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి

సింహగిరిపై స్వామి వారికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు.



బొగ్గు లారీ బీభత్సం

IIలో

లంకెలపాలెంలో బొగ్గు లారీ పలు వాహనాలను ఢీకొనడంతో 8 మందికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
అనకాపల్లి	6.13	4.40
నర్సీపట్నం	6.17	4.37

న్యూస్‌రీల్

రేపు బ్యాంకులు పనిచేస్తాయి



లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ

అనకాపల్లి: ఆర్బీఐ ఆదేశాల మేరకు ఈ నెల 31న జిల్లాలో 220 ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకులు పనిచేస్తాయని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి వివిధ రూపాల్లో పన్నులు చెల్లించేవారు, ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదో శనివారం అయినప్పటికీ యథావిధిగా సేవలందిస్తాయని, ఏప్రిల్ 1న బ్యాంకుల్లో వార్షిక లావాదేవీలు కారణంగా ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తారని, ఖాతాదారులు మాత్రం రావొద్దని సూచించారు. రెండో తేదీ నుంచి అన్ని బ్యాంకులు వారి పని దినాల్లో విధులు నిర్వహిస్తాయని తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై చర్యలకు సిఫార్సు

యలమంచిలి రూరల్: టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మున్సిపాలిటీ వార్డు సచివాలయ ఉద్యోగిపై వేటుకు రంగం సిద్ధమైంది. ఎస్ రాయవరం మండలం రేవుపోలవరం గ్రామానికి చెందిన వాసుపల్లి ఆదిరాజు యలమంచిలి పట్టణం ఏఎస్ఆర్ కాలనీ సచివాలయంలో వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఎలాంటి అనుమతి లేకుండా గతేడాది అక్టోబరు 14వ తేదీ నుంచి విధులకు హాజరు కావడం లేదు. పైగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించి టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. ఈ విషయమై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'టీడీపీ ప్రచారంలో సచివాలయ ఉద్యోగి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు విచారణ చేశారు. సదరు ఉద్యోగి ప్రచారంలో పాల్గొన్నట్టు మున్సిపల్ కమిషనర్ కేపీ కొండలరావు నిర్ధారించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ పురపాలన రీజనల్ డైరెక్టర్ నాగరాజు, యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కే మనోరమలకు లేఖ పంపించారు. దీనికి సాక్షిలో ప్రచురితమైన వార్త క్లిప్పింగు, టీడీపీ కార్యకలాపాలు, ప్రచారంలో సచివాలయ ఉద్యోగి పాల్గొన్న ఫొటోలను జోడించారు.

కూటమి బూటకం

- ఎక్కడికక్కడే ఒంటరి పోరాటం
- నియోజకవర్గాల్లో పొసగని పొత్తు
- తలోదారిలో టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడరు
- అభ్యర్థుల ప్రచారానికి ఆమడ దూరం
- బరిలో నిలిచిన కూటమి అభ్యర్థుల్లో ఓటమి భయం



సాక్షి, విశాఖపట్నం : తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిలో పొత్తులు పొసగడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ఒకరికొకరు సహకరించుకోవడం లేదు. ఆ పార్టీల ముఖ్య నేతలు, శ్రేణులు ఈ ఎన్నికల్లో తామంతా కలిసి ముందుకు వెళ్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించినా వారి తరఫున ప్రచారానికి కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. అక్కడక్కడ మొక్కుబడిగా కనిపిస్తున్నారు. దీంతో అభ్యర్థులు ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పేరుకే పొత్తులు తప్ప లోలోపల 'మిత్రులకు' సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. దీంతో ఇప్పట్నుంచే కూటమి అభ్యర్థులకు ఓటమి భయం వెంటాడుతోంది.

- పొత్తులో విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించారు. ఈయన అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీలో సీటును ఆశించిన ముగ్గురు ముఖ్య నేతలు సాధిక్, కందుల నాగరాజు, మూగి శ్రీనివాసరావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరు వంశీకి సహకరించే ప్రసక్తే లేదని తెగేసి చెబుతున్నారు. ఈ సీటుపై టీడీపీ నుంచి అక్కడ ఇన్‌చార్జి గండి బాబ్జీ గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ జనసేనకు ఖరారు చేయడంతో రాజీనామా చేస్తానని బెదిరించారు. ఆ తర్వాత చంద్రబాబు బుజ్జగించడంతో మెత్తబడినా పూర్తిస్థాయిలో వంశీ కోసం పనిచేస్తారన్న నమ్మకం లేదు. ప్రస్తుతం వంశీకృష్ణ తన అనుచరులతోనే దక్షిణలో ప్రచారం చేసుకుంటున్నారు.

యలమంచిలి

సీటును జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు కేటాయించారు. ఈయన అభ్యర్థిత్వాన్ని అక్కడ సీటును ఆశించిన టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అంగీకరించడం లేదు. ప్రగడ అనుచరులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి పార్టీ కార్యాలయంలో ఫర్నిచరును కూడా ధ్వంసం చేశారు. జనసేన అభ్యర్థికి మద్దతుగా ప్రచారానికి ముందుకు రావడం లేదు.

- విశాఖ ఉత్తరం పొత్తులో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు దక్కింది. ఆ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన క్యాడరు ఆయన వెంట ప్రచారానికి సుముఖత చూపడం లేదు. ఈ సీటు ఆశించిన పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేటి రఘులను ఇప్పుడు ప్రసన్నం చేసుకునే పనిలో విష్ణుకుమార్‌రాజు ఉన్నారు. అక్కడ అంతంతమాత్రంగా ఉన్న టీడీపీలో సరైన నాయకుడే లేదు. ఉన్న అరకొర నాయకులూ బీజేపీ అభ్యర్థి వెంట నడవడం లేదు.
- విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడికి బీజేపీ, జనసేన శ్రేణులు దూరంగా ఉంటున్నారు. దీంతో తన అనుచరులతోనే వెలగపూడి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.
- విశాఖ 'పశ్చిమ'లో టీడీపీ అభ్యర్థి గణబాబుకు మద్దతుగా బీజేపీ, జనసేన సీనియర్లు ప్రచారంలో పాల్గొనడం లేదు. తమకు సహకరించాలని గణబాబు తన వర్గీయులను పంపుతున్నా అటు నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదు.
- పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడంతో ఆ సీటు తనకే ఖాయమనుకున్న టీడీపీకి చెందిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. తన అనుచరులను రోజూ రోడ్డెక్కించి ఆందోళనలు చేయిస్తున్నారు. దీంతో అక్కడ జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు టీడీపీ నుంచి సహకారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. దీంతో జనసేన క్యాడరుతోనే ఒంటరిగా ప్రచారం చేసుకుంటున్నారు.
- ఇక చోడవరంలోనూ అదే పరిస్థితి. టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ రాజుకు టికెట్టు ఇవ్వడాన్ని అక్కడ జనసేన, బీజేపీ నాయకులకు ఇష్టం లేదు. అందువల్ల రాజు ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి వీరు సుముఖత చూపడం లేదు.
- పాయకరావుపేట టీడీపీ టికెట్టు అనితకిచ్చారు. ఆమె అభ్యర్థిత్వాన్ని అక్కడ జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి వర్గీయులతో పాటు టీడీపీలోని ఒక వర్గం ఎప్పట్నుంచో ససేమిరా అంటోంది. ఇటీవలే బుజ్జి వర్గాన్ని బుజ్జగించినా ప్రచారంలో పాల్గొనడంపై ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. బీజేపీ ముఖ్య నాయకులు కూడా ఆమె వెంట కనిపించడం లేదు.
- ఇక రంపచోడవరం సీటు టీడీపీ అభ్యర్థి శిరీషకు దక్కింది. ఆమెకు టికెట్టు ఇవ్వడంపై అక్కడ మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, వెంకటేశ్వరరావులు గుర్రుగా ఉన్నారు. దీంతో శిరీషకు సొంత పార్టీ వారి మద్దతు ప్రశ్నార్థకంగా మారింది.

మాడుగులలో

విచిత్రమైన పరిస్థితి ఉంది. అక్కడ పైలా ప్రసాద్‌కు టీడీపీ సీటు ఇవ్వడాన్ని ఆ పార్టీకే చెందిన మాజీ ఎమ్మెల్యే రామానాయుడు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన వర్గీయులెవరూ ప్రసాద్ ప్రచారంలో పాల్గొనడం లేదు. ఇక జనసేన, బీజేపీ నాయకులూ ప్రచారానికి వెళ్లడం లేదు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



శిలువ భుజాన మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారి

గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మరణానికి సంబంధించిన ఘట్టాలను ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ చేశారు. గాంధీగ్రామం ఆర్సీఎం చర్చి నుంచి ప్రారంభమైన ప్రదర్శన చోడవరం పట్టణ పురవీధులు, మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. ఏసుక్రీస్తు వేషధారి శిలువను మోయడం, ఆయనను రాజభటులు కొడుతూ చిత్రహింసలకు గురిచేయడం భక్తులను కదిలించింది. ఏసుక్రీస్తుకు శిలువ వేస్తున్నప్పుడు మరియా మాత తల్లడిల్లిపోయిన ఘట్టం అందర్నీ కన్నీరు పెట్టించింది. ఈ ప్రదర్శనలో వందలాది మంది మహిళలు, పిల్లలు, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని చర్చిలలో శిలువలను చేతితో ధరించి ప్రార్థనలు చేశారు. చోడవరం, గోవాడ, వెంకన్నపాలెం, గాంధీగ్రామం, గౌరీపట్నం, దామునాపల్లి, గవరవరం, లక్కవరం గ్రామాల్లో ఉన్న బాప్టిస్టు, లూథరన్, కేథలిక్ చర్చిల్లో క్రీస్తు మరణంపై ప్రత్యేక ప్రార్థనలు, కూటములు నిర్వహించారు. – చోడవరం



ఏసుక్రీస్తును శిలువ వేసిన దృశ్యం

ధన బలాన్ని జన బలంతో ఎదుర్కొందాం

- కూటమి అభ్యర్థులను వచ్చిన చోటికే పార్శిల్ చేద్దాం
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు
- ధర్మ యుద్ధానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ధర్మశ్రీ పిలుపు



మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు, వేదికపై కరణం ధర్మశ్రీ

రావికమతం: ధన బలంతో ఎక్కడెక్కడి నుంచో అభ్యర్థులను చంద్రబాబు దిగుమతి చేస్తున్నారని, అలాంటి వారిని వచ్చిన చోటికే బెల్లం పార్సిల్ చేసినట్టుగా జన బలంతో పంపేద్దామని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. శుక్రవారం రావికమతంలో పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బూడి పాల్గొని మాట్లాడారు. నవరత్నాలతో ఇంటింటికీ మేలు చేసి జనం గుండెల్లో నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై కుటిల యత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల రుణాలు బ్యాంకులకు ఎగ్గొట్టి అక్రమంగా సంపాదించిన సీఎం రమేష్‌ను అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా దింపుతున్నారన్నారు. జన బలం ముందు ధన బలం నిలవదని నిరూపించాలన్నారు. కూటమి అభ్యర్థులను సాగనంపి జన బలం ఉన్న జగనన్న అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. నిబద్ధత గల కార్యకర్తను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ విధంగా గుర్తిస్తారో తానే ఉదాహరణ అన్నారు. ఎంపీగా తనను, చోడవరం ఎమ్మెల్యేగా ధర్మశ్రీని, అనకాపల్లి ఎమ్మెల్యేగా మలసాల భరత్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీగా గెలిచాక అనకాపల్లిలోనూ, తన స్వగ్రామంలోనూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. నెలకోసారి నియోజకవర్గంలో తిరుగుతానని అబద్ధం చెప్పనని, చేసేదే కచ్చితంగా చెబుతానని ప్రమాణం చేశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పక్షపాతంతోనే బీఎన్‌రోడ్డు పనుల నిలిపివేత

చోడవరం నియోజకవర్గానికే ప్రధానమైన బీఎన్ రోడ్డు పనులు టీడీపీకి చెందిన సదరు కాంట్రాక్టర్ చౌదరి పక్షపాతంతో ఆలస్యం చేశారని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ధ్వజమెత్తారు. ఈ రోడ్డుతోపాటు వేపగుంట–పినగాడి, వడ్డాది–గరికిబంద రోడ్లను ఆలస్యం చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు చెడ్డ పేరు రావాలని చూశారన్నారు. మళ్లీ మన ప్రభుత్వం వచ్చాక ఈ పనులు చేయడమే కాక వాడి భరతం పడదామన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశానని, అత్యధికంగా నిధులు మంజూరు చేయించానన్నారు. కాంట్రాక్టర్ కారణంగా రోడ్డు పనులు ఆగినప్పటికీ సొంత నిధులు రూ.60 లక్షలతో పనులు చేయిస్తున్నానన్నారు. ఎంపీగా గెలిచిన తక్షణమే బీఎన్ రోడ్డును తుని నుంచి సబ్బవరం వరకు జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు. చోడవరం నియోజకవర్గంలో రోడ్లన్నీ పాడవ్వడానికి కారణం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు క్వారీల దాహమే కారణమన్నారు. ఆయన గ్రానైట్ క్వారీల ట్రాలీలు హెవీలోడ్‌లతో తిరగడం వల్లే పోయాయన్నారు. మళ్లీ ఆయన్ను గెలిపిస్తే రోడ్లతోపాటు కొండలు మాయమవుతాయని విమర్శించారు. చోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కాశీ విశ్వనాథం, రావికమతం, మాడుగుల ఎంపీపీలు పైల రాజు, తాళ్లపురెడ్డి రాజారామ్, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మాజీ జెడ్పీటీసీ ఆశరి గోవిందరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, మత్స భవానీప్రసాద్ పాల్గొన్నారు.

కోడ్‌లోనూ ఉల్లంఘనుడే..





లంకెలపాలెం నుంచి అనకాపల్లి జలగాం మదుం జంక్షన్ వరకు సాగిన బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేష్ స్వాగత ర్యాలీలో స్తంభించిన ట్రాఫిక్

- అనకాపల్లి పార్లమెంటు కూటమి అభ్యర్థి రమేష్ అత్యుత్సాహం
- స్వాగత ర్యాలీలో 4 గంటల పాటు ప్రజలకు చుక్కలు
- అనుమతికి మించి 2 వేల మంది జనం, 300 కార్లతో ర్యాలీ
- లంకెలపాలెం – అనకాపల్లి హైవేపై స్తంభించిన ట్రాఫిక్
- బండారుతోపాటు పరవాడ మండలం టీడీపీ కార్యకర్తల డుమ్మా

సాక్షి, అనకాపల్లి: వివాదాస్పద నాయకుడు, కూటమి తరఫున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న సి.ఎం.రమేష్ ఆదిలోనే నియోజకవర్గ ప్రజలకు చుక్కలు చూపించారు. ఇంకా నామినేషన్ వేయకముందే తన ధన బలం ఈ ప్రాంత వాసులకు చూపించాలని అత్యుత్సాహం ప్రదర్శించారు. భారీ ఎత్తున స్వాగత ర్యాలీ నిర్వహించి అడుగడుగునా కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించారు. దాంతో లంకెల పాలెం నుంచి అనకాపల్లి వరకూ 11 కిలోమీటర్ల మేర హైవేపై ట్రాఫిక్ స్తంభించింది. శుక్రవారం ఉదయం 11.55 గంటలకు లంకెలపాలెం వచ్చిన రమేష్‌కు స్వాగతం పలకడం కోసం.. 9.30 గంటల నుంచే ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దాదాపు నాలుగు గంటల పాటు వాహనచోదకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా ఎన్నికల అధికారి నుంచి 100 మందికి, 5 కార్లకు మాత్రమే అనుమతి కోరిన వారు.. 300కు పైగా కార్లు, 2 వేల మందికిపైగా జనంతో ర్యాలీగా వెళ్లారు. అనకాపల్లిలో ముఖ్య నాయకుల మీటింగ్‌కు మాత్రమే అనుమతి కోరిన బీజేపీ ఎంపీ అభ్యర్థి జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ర్యాలీ చేశారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసులకు అదనంగా రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్న సమయంలో మండుటెండలో ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు.

రమేష్‌కు పరుచూరి జనసేన కార్యాలయం

తనకు అనకాపల్లి ఎమ్మెల్యే సీటు కేటాయించలేదని జనసేనకు రాజీనామా చేసినట్లు ప్రకటించిన పరుచూరి భాస్కరరావు.. తన జనసేన కార్యాలయాన్ని సీఎం రమేష్ క్యాంప్ కార్యాలయంగా ఇచ్చారు. అది ఇప్పుడు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి కార్యాలయంగా మారింది. జనసేన పార్టీకి రాజీనామా చేసిన వ్యక్తి తన కార్యాలయాన్ని కూటమి అభ్యర్థికి ఇచ్చారేమిటని అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. కొణతాల రామకృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేయలేకనే రాజీ డ్రామా ఆడినట్లు స్పష్టమవుతోంది.

జిల్లా సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి: తనను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చి జిల్లాను అభివృద్ధి చేస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. శుక్రవారం అనకాపల్లిలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ముఖ్యనాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. లోకల్, నాన్ లోకల్ అనే తారతమ్యం చూపవద్దని, తనను గెలిపిస్తే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తానని, పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి బాట పట్టిస్తానన్నారు. సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభంలోనే ర్యాలీకి 'బండారు' దెబ్బ

పరవాడ మండలం లంకెలపాలెం నుంచి స్వాగత ర్యాలీ ప్రారంభించారు. ప్రారంభంలోనే సీఎం రమేష్‌కు చుక్కెదురైంది. పెందుర్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు గానీ, కార్యకర్తలు గానీ ఎవరూ హాజరు కాలేదు. బీజేపీ, జనసేన పార్టీల నుంచి మాత్రమే స్వాగతం పలికారు. టీడీపీ నుంచి ఒక్క కార్యకర్త రాలేదు. బండారు సత్యనారాయణమూర్తికి పెందుర్తి టికెట్ ఖరారు చేయలేదనే ఆగ్రహంతో ఉన్న పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఎవరూ రాలేదు. మాజీ మంత్రి బండారు ఆరోగ్యం బాలేకపోయినా.. ఆయన అనుచరులెవరూ రాలేదు. పెందుర్తి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు లంకెలపాలెం జంక్షన్‌కు రాలేదు. అనకాపల్లిలో ముఖ్య నేతల సమావేశానికి చివరిలో మొక్కుబడిగా వచ్చి వెళ్లిపోయారు. స్వాగత ర్యాలీకి, ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారుడు దాడి రత్నాకర్, వారి అనుచరులు డుమ్మా కొట్టారు.





ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు ముఖేష్‌కుమార్, డైరెక్టర్ గంగూలీ, హెడ్ కోచ్ రికీ పాంటింగ్





విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాళ్లు

గెలుపెవరిది?

- రేపు డీసీతో సీఎస్‌కే మ్యాచ్
- విశాఖ చేరిన ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్/గోపాలపట్నం: ఐపీఎల్‌లో భాగంగా తలపడేందుకు ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) జట్లు శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకున్నాయి. ఇరు జట్లకు విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. క్రికెటర్లను తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు. రెండు జట్ల సభ్యులు ప్రత్యేక బస్సుల్లో రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్ వెళ్లారు. పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం ఇరు జట్లు తలపడనుండగా.. శనివారం ప్రాక్టీస్ చేయనున్నాయి. ప్రస్తుత 17వ ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో ఆర్సీబీ మినహా హోం గ్రౌండ్ జట్లే విజయకేతనం ఎగురవేస్తున్నాయి. డీసీ ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైంది. డీసీ విశాఖను తొలి సెషన్ మ్యాచ్‌లకు హోం గ్రౌండ్‌గా ఎంచుకుంది. ఇక డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఇప్పటికే సీఎస్‌కే ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. అయితే ఈ రెండు మ్యాచ్‌లను హోం గ్రౌండ్‌లోనే ఆడి గెలిచింది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఇదే ఊపును సీఎస్‌కే కొనసాగిస్తుందా లేక హోం గ్రౌండ్ సెంటిమెంట్‌తో డీసీ గెలుపునకు శ్రీకారం చుడుతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

డీసీతో సీఎస్‌కే మ్యాచ్‌కు సిద్ధం

విశాఖ స్పోర్ట్స్: ఈ నెల 31న డీసీతో తలపడే సీఎస్‌కే మ్యాచ్‌కు వైఎస్సార్ స్టేడియం సిద్ధమైందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీస్ అధికారుల సహకారంతో బీసీసీఐ నిబంధనల మేరకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి నాయకత్వంలో నాలుగేళ్లలో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించడంతోనే ఐపీఎల్ మ్యాచ్‌లు కేటాయించారన్నారు. క్రీడాకారులు, మ్యాచ్ నిర్వహణ సిబ్బందికి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

పైలాకు ఝలక్?

- మాడుగుల టికెట్ గవిరెడ్డికి ఇవ్వాలని అయ్యన్న ఒత్తిడి
- రామానాయుడికి సీటు ఇస్తే ఖర్చు భరిస్తానంటున్న సి.ఎం.రమేష్
- అయోమయంలో టీడీపీ శ్రేణులు

సాక్షి, అనకాపల్లి: మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థి మారనున్నారా? చంద్రబాబు పైలా ప్రసాదరావుకు ఝలక్ ఇవ్వనున్నారా? అవుననే అంటున్నాయి పార్టీ శ్రేణులు. ప్రసాదరావు స్థానంలో తనకు సన్నిహితుడైన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడికి టికెట్ ఇవ్వాలని అధిష్టానంపై అయ్యన్నపాత్రుడు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. మాడుగులలో టీడీపీ గెలవాలంటే అభ్యర్థిత్వం మార్పు చేయాలని ఆయన వాదిస్తున్నారని భోగట్టా. రామానాయుడు విరివిగా డబ్బు ఖర్చు చేయలేడనే టికెట్ పైలా ప్రసాద్‌రావుకు కేటాయించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే అయ్యన్నపాత్రుడు చెప్పినట్టు చేయాలని.. అవసరమైతే రామానాయుడి ఖర్చు తానే భరిస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ చెప్పినట్టు సమాచారం. దీంతో టీడీపీ అధిష్టానం పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది.

సైలెంట్ అయ్యారనుకుంటే..

గత మూడుసార్లు మాడుగుల నుంచి పోటీ చేసిన రామానాయుడు ఒకసారి గెలిచారు. రెండుసార్లు బూడి ముత్యాలనాయుడు చేతిలో ఓటమి చెందారు. దీంతో చంద్రబాబు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పీవీజీ కుమార్‌ను నియమించారు. ప్రస్తుతం మాడుగుల టికెట్ కోసం పైలా, గవిరెడ్డి, పీవీజీ పోటీ పడగా ఆర్థికంగా బలంగా ఉన్న పైలా ప్రసాద్‌రావుకే టికెట్ ప్రకటించారు. రామానాయుడిని పిలుపించుకుని బుజ్జగించారు. వారం రోజులు సైలెంట్‌గా ఉన్న రామానాయుడు రెండు మూడు రోజుల నుంచి మాడుగుల టికెట్ తనకే వస్తుందన్న ధీమా ప్రదర్శిస్తున్నారు. ఆ విషయాన్ని ఆయనతో పాటు ఆయన వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని తెలుగుదేశం కార్యకర్తలు అయోమయానికి లోనవుతున్నారు.

‘ఉత్తర’ కుమారుడు.. మళ్లీ భీమిలికి..

- ఎన్నికకో నియోజకవర్గం మారుతున్న గంటా
- సంచార రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరు
- చివరి నిమిషంలో భీమిలి టికెట్ కేటాయించిన చంద్రబాబు
- ఉత్తరంలో గెలిచిన ఐదేళ్లలో జనానికి ముఖం చాటేసిన వైనం
- ఇప్పుడు భీమిలి ప్రజల్ని మరోసారి మోసం చేసేందుకు పయనం



సాక్షి, విశాఖపట్నం : ఆయనో రాజకీయ సంచారజీవి.. పిల్లిపిల్లలను మార్చిన చందంగా ఎన్నికలకో నియోజకవర్గం మారుస్తూ.. పోటీ చేసిన ప్రతి నియోజకవర్గంలో ప్రజల్ని ఏమారుస్తూ.. గెలిచిన తర్వాత.. ఓటర్లను మోసం చేస్తూ.. చివరి నిమిషంలో అక్కడి నుంచి జంప్ అయిపోతారు. ఎన్నికలకో సెగ్మెంట్ మారుస్తున్న గంటా శ్రీనివాసరావు అడ్డగోలు సంపాదన, స్థిర, చరాస్తులను కూడబెట్టడంలో మాత్రం ఏకరీతినే దూసుకుపోయారు. నిన్న మొన్నటి వరకూ టికెట్ కోసం అధిష్టానం చుట్టూ కాళ్లరిగేలా తిరిగే స్థితికి చేరుకున్న గంటాకు.. చీపురుపల్లిలో పోటీ చేయాల్సిందేనని చంద్రబాబు తేల్చి చెప్పగా.. చివరికి బతిమాలుకొని భీమిలి టికెట్ సంపాదించుకున్నారు. ఈ ఎన్నికల్లో తన వలస రాజకీయంతో మరోసారి భీమిలి ప్రజలను మోసం చేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రకాశం జిల్లా నుంచి బతుకుదెరువు కోసం విశాఖకు వలస వచ్చి ఓ దినపత్రికలో యాడ్ ఎగ్జిక్యూటివ్‌గా జీవితాన్ని ప్రారంభించాడు. చిరుద్యోగిగా ఆదాయ ప్రస్థానం మొదలుపెట్టిన గంటా.. ఆ తర్వాత షిప్పింగ్ రంగంలో వ్యాపారవేత్తగా ఎదిగారు. 1999లో అనూహ్య రీతిలో టీడీపీ తరఫున అనకాపల్లి ఎంపీగా, ఆ తర్వాత 2004లో చోడవరం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా, 2009లో ప్రజారాజ్యం తరఫున అనకాపల్లి ఎమ్మెల్యేగా, 2014లో భీమిలి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా, 2019లో విశాఖ ఉత్తర ఎమ్మెల్యేగా గెలుపొందారు. నిజానికి 1999లో ప్రజాప్రతినిధిగా రాజకీయ జీవితం మొదలుపెట్టినా.. కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం విలీనమైన పరిణామాల నేపథ్యంలో 2011లో తొలిసారి మంత్రి బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి క్రమక్రమంగా ఆరోపణలు వెల్లువెత్తుతూ వచ్చాయి. ఇక 2014లో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో గంటాకు మళ్లీ మంత్రి పదవి రావడం దరిమిలా మొదలైన అవినీతి, అక్రమార్జన పర్వం, దోపిడీ పరాకాష్టకు చేరుకుంది.

ఓటేసిన జనాన్ని లెక్క చేయని గంటా..

తాను చేసిన అక్రమాలు, అవినీతి పనులు బట్టబయలు కావడంతో 2019 ఎన్నికల్లో భీమిలి ప్రజలు ఛీకొడతారని ముందుగానే ఊహించిన గంటా.. వ్యూహాత్మకంగా బీజేపీకి కేటాయించిన విశాఖ ఉత్తర సీటును దక్కించుకున్నారు. ఎలాగోలా భీమిలి నుంచి బయటపడి టికెట్ తెచ్చుకున్న గంటా.. ఎన్నికల సమయంలో ఉత్తర నియోజకవర్గ ప్రజల్ని మోసపూరిత హామీలతో మభ్యపెట్టారు. పోలింగ్ సమయంలో చివరి నిమిషంలో బర్మాక్యాంపు తదితర కొండవాలు ప్రాంతాల్లో దొంగ ఓట్ల వ్యవహారంతో గట్టెక్కి విజయం సాధించారు. అంతే ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత నేటి వరకూ ఉత్తర ప్రజలకు ఒక్కసారైన మొహం చూపించకుండా ఎంవీపీలోనే తిష్టవేసుక్కూర్చున్నారు. తాము ఓటేసి గెలిపించిన పాపానికి తగిన శాస్తి జరిగిందంటూ ఆవేదన చెందుతున్న నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు అండగా నిలబడ్డారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. ఈసారి ఉత్తరంలో పోటీ చేస్తే.. ఓటమి తప్పదని భావించిన గంటా.. మరోసారి భీమిలికి వెళ్లిపోవాలని అక్కడి నేతలతో మంతనాలు ప్రారంభించారు. గెలుపొందిన చోట్ల దోపిడీకి పాల్పడే గంటా చేతిలో మరోసారి తాము మోసపోయే స్థితిలో లేమని భీమిలి ప్రజలంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. అయినా నిస్సిగ్గుగా భీమిలిని దోచుకునేందుకు గంటా మళ్లీ బయలుదేరడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంతులేని గంటా గ్యాంగ్ దందాలు

ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా లెక్క చెయ్యకుండా.. అవినీతిని కొనసాగించడమే గంటా స్టైల్. గంటా విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీలో ఉంటున్న బహుళ అంతస్తుల భవంతితో పాటు.. ప్రత్యూష పేరుతో కంపెనీ స్థాపించి.. రూ.200 కోట్లకు పైగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టేశారు. దీంతో సదరు ఇండియన్ బ్యాంకు గంటా అండ్ కో అడ్డగోలుగా సంపాదించిన పలు స్థలాల్ని వేలం వేస్తుండగా.. మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంది. గంటా దోపిడీ పర్వాన్ని మొత్తం లెక్క కడితే రూ.వందల కోట్ల పైనే ఉంటుందని టీడీపీ నేతలే అంచనా వేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకూ గంటా గ్యాంగ్ భీమిలిలో సాగించిన భూదందాలతో మళ్లీ అక్కడ మొఖం చూపించలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. నమ్ముకొని ఓటేసిన భీమిలి ప్రజలకు ఏమాత్రం మంచి చెయ్యకుండా కనిపిస్తే కబ్జా పేరుతో దందా సాగించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు అండ్ కో విశాఖలో భూ దందాలకు తెగబడినప్పుడు కీలక సూత్రధారి గంటాయేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గంటా శ్రీనివాసరావే భూదొంగ అంటూ అదే పార్టీకి చెందిన సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడే స్వయంగా సిట్‌కు ఫిర్యాదు చేయడంతో కలకలం రేగింది. అక్రమాల ఆరోపణలు చుట్టుముట్టడంతో తరుణంలో భీమిలి నుంచి ఎలాగైనా తప్పించుకోవాలని గంటా నిర్ణయించుకున్నారు.

‘సుందరపు’ అభ్యర్థిత్వంపై రీ సర్వే

- పవన్ కల్యాణ్ వాయిస్‌తో ఐవీఆర్ఎస్ కాల్స్
- నంబర్ 2(నోటా) నొక్కుతున్న టీడీపీ శ్రేణులు
- యలమంచిలిలో కొనసాగుతున్న పొత్తు కష్టాలు

యలమంచిలి రూరల్: యలమంచిలి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కూటమి అభ్యర్థిగా జనసేన నియోజకవర్గ సమన్వయకర్త సుందరపు విజయ్ కుమార్ పేరును ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించడంతో నియోజకవర్గ టీడీపీలో ప్రకంపనలు మొదలయ్యాయి. టిక్కెట్ తనకే వస్తుందంటూ ఆశించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, ఆయన అనుచరులు ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నియోజకవర్గ టీడీపీ సీనియర్లంతా చంద్రబాబు వద్దకు వెళ్లి నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. ఇదే సమయంలో కూటమి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ అభ్యర్థిత్వంపై జనసేన పార్టీ రీ సర్వే చేపడుతోంది. నియోజకవర్గంలోని పలువురికి జనసేన పార్టీ కార్యాలయం నుంచి రెండు రోజులుగా పవన్ కల్యాణ్ వాయిస్‌తో ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. యలమంచిలి అసెంబ్లీ టిక్కెట్ సుందరపు విజయ్ కుమార్‌కు ఇవ్వడం మీకు ఇష్టమైతే 1 నొక్కండి, కాదంటే నోటాకు 2 నొక్కండంటూ ఈ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. కొందరు టీడీపీ సానుభూతిపరులకు కూడా ఫోన్లు రావడంతో వారంతా సుందరపు అభ్యర్థిత్వం వద్దంటూ రెండవ నంబరు ఆప్షన్‌ను ప్రెస్ చేస్తున్నారనే ప్రచారం నియోజకవర్గంలో జరుగుతోంది. ఎవరికైనా ఫోన్ కాల్స్ వస్తే ఇలా చేయాలంటూ నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మిగిలిన మండలాల నాయకులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. పునఃపరిశీలనలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా జనసేన అధిష్టానం సుందరపు విజయ్ కుమార్ అభ్యర్థిత్వాన్ని కొనసాగిస్తుందా? లేక మార్పు చేస్తుందా ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అభ్యర్థి పేరు ప్రకటించిన తర్వాత జనసేన అధిష్టానం రీ సర్వే చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశమవుతోంది. శుక్రవారం అనకాపల్లి పార్లమెంటు కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌కు స్వాగతం పలకడానికి కూడా జనసేన,టీడీపీ శ్రేణులు వేర్వేరుగానే తరలివెళ్లాయి.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి 15 రోజులు గడుస్తున్నా నియోజకవర్గంలో టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు,శ్రేణులు ఏకతాటి పైకి రాకపోవడం,అభ్యర్థులను ప్రకటించిన తర్వాత మళ్లీ రీసర్వేలు చేయడం తదితర పరిణామాల నేపథ్యంలో మూడు పార్టీల క్యాడర్‌లో అయోమయం నెలకొంది. రానురాను ఇవన్నీ ఎటు దారితీస్తాయోనన్న ఆందోళనను కూటమికి చెందిన పలువురు నేతలు వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

- మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ సమక్షంలో చేరికలు



తారువాలో కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి అనురాధ

మాడుగుల: జంపెన గ్రామంలో టీడీపీ, జనసేనలకు చెందిన 14 మంది.. సర్పంచ్ నేమాల గురువునాయుడు ఆధ్వర్యంలో మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తారువాలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నుంచి నలుగురు, జనసేన నుంచి 10 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

పెచ్చేట్టి రమణమ్మ, తాటికొండ సత్యవతి, తాటికొండ పార్వతి, వానపల్లి లక్ష్మి, వానపల్లి శివనాగేష్, తానాపతి కొండయ్య, మజ్జి కొండలరావు, మజ్జి నానాజీ, కందాల మదుశంకర్, గ(ట్రె)డ్డి నాయుడు, పెచ్చేటి చిలుకు నాయుడు, వానపల్లి రాము, తాటికొండ రాజు, తాటికొండ దేముళ్లకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈర్లె అనురాధ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు రానున్న కాలంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన తాటికొండ సత్యవతి, వానపల్లి శివనాగేష్ తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై, వైఎస్సార్‌సీపీలో చేరినట్టు చెప్పారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పచ్చికూర మాణిక్యం, పెచ్చేటి శివాజీ, కందాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిరిజాంలో అగ్ని ప్రమాదం

- పశువుల పాకలు, చింతచెట్లు, ధాన్యం పురులు, గడ్డివాములు దగ్ధం
- సుమారు రూ.7 లక్షల మేర ఆస్తి నష్టం



గడ్డివాము మంటలను ఆర్పుతున్న యువకులు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చీడికాడ: మండలంలోని శిరిజాంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో 10పశువుల పాకలు, గడ్డివాములు, ధాన్యం పురులు, చింతచెట్లు దగ్ధమై రూ.7 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది.గ్రామానికి ఆనుకుని ఉన్న గుంపాన వారి కళ్లాల్లో మధ్యాహ్నం 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు పడి, గుంపాన ఎర్రినాయుడు పాకపై మంటలు చెలరేగాయి. గాలి వీచడంతో అగ్నికీలలు ఒక్కసారిగా వ్యాపించి పక్కనే ఉన్న గుంపాన దేముళ్లు, గుంపాన ఈశ్వరరావు, గంగునాయుడు, సన్యాసిరావు, తులసీరావు, ముసిలినాయుడు, నరసింహుడు, శేషుబాబు, దేముడమ్మ, నాగేశ్వరరావు, అచ్చిబాబు, వెంకటరమణ, లక్ష్మణలకు చెందిన పశువుల పాకలు, 5 గడ్డివాములు, 2 ధాన్యం పురులు, 10 చింతచెట్లు ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న మాడుగుల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే పాకల సమీపంలోని వ్యవసాయ బోర్ల నీటితో రైతులు, యువకులు మంటలను చాలా వరకు అదుపులోకి తెచ్చారు. లేకుంటే మరింత ఆస్తి, ప్రాణ నష్టం కూడా వాటిల్లేదని స్థానికులు చెప్పున్నారు. సంఘటనా స్థలాన్ని వీఆర్వో శేఖర్ పరిశీలించి, బాధితుల పేర్లు, వివరాలను నమోదు చేశారు.

3,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

దేవరాపల్లి: రైవాడ జలాశయం సమీపంలోని బొడ్డపాడు గ్రామంలో సారా తయారీ స్థావరాలపై దేవరాపల్లి పోలీసులు శుక్రవారం దాడి చేశారు. రైవాడ జలాశయానికి ఆనుకుని పెద్ద ఎత్తున సారా తయారీ స్థావరాలు ఉన్నట్టు అందిన సమాచారం మేరకు స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన 3,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, సారా తయారీకి వినియోగించిన 15 డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. సారా విక్రయించినా, తయారు చేసినాకఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ట్యాంకర్‌ని ఢీకొన్న కారు

- వైభవ్ జ్యుయలర్స్ ఉద్యోగి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతుడు శివకుమార్



పులపర్తి వద్ద ట్యాంకర్ లారీని ఢీకొట్టిన కారు

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి కూడలి సమీపంలో జాతీయరహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో విశాఖపట్నం వైభవ్ జ్యుయలర్స్ మెయిన్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న మైలపల్లి వెంకట శివకుమార్(45) మృతి చెందాడు. అదే సంస్థ ఉద్యోగి బి.వి.ఎస్.కృష్ణ, కారు డ్రైవర్ కొండగొర్రి మల్లు దొర కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. సంస్థ పని నిమిత్తం వీరు భీమవరం వెళ్లారు. అక్కడి నుంచి గురువారం రాత్రి విశాఖకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారు యలమంచిలి మండలం పులపర్తి వద్ద రోడ్డుపై నిలిపిన ట్యాంకర్‌ను ఢీకొంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే హైవే అంబులెన్సులో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ వెంకట శివకుమార్ మృతి చెందగా, గాయపడిన ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం షీలానగర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కారు వెనుక భాగంలో కూర్చున్న బి.వి.ఎస్. కృష్ణ పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ సైల సింహాచలం తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్, కారు డ్రైవర్లు బేతపూడి రాము,కొండగొర్రి మల్లు దొర కుమార్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో వెంకట శివకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించామని ఆయన చెప్పారు.ఆస్పత్రి మార్చురీ వద్ద మృతుని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బొగ్గు లారీ బీభత్సం

- 8 మందికి తీవ్ర గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- దెబ్బతిన్న కార్లు, ఆటోలు, బైక్‌లు, లారీలు
- ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికుల అవస్థలు
- లంకెలపాలెం కూడలిలో ఘటన



లారీ ఢీకొనడంతో కారుపై ఎగిరి పడిన ట్రాక్టర్



లంకెలపాలెం కూడలిలో బీభత్సం సృష్టించిన బొగ్గు లారీ ఇదే..





ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో

పరవాడ: లంకెలపాలెం కూడలిలో ఓ బొగ్గు లారీ సృష్టించిన బీభత్సానికి ప్రజలు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో 8 మందికి తీవ్రగాయాలు కాగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. లారీ ఢీ కొట్టిన ఈ ఘటనలో ఓ ట్రాక్టర్ అక్కడే ఉన్న కారుపై ఎగిరిపడింది. మొత్తంగా రెండు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, రెండు కార్లు, మరో లారీ దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, రెయిలింగ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రెండు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్రేకులు ఫెయిలై ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివీ..

విశాఖ పోర్ట్ ట్రస్ట్ నుంచి బొగ్గు లోడుతో ఓ లారీ శుక్రవారం గాజువాక నుంచి అనకాపల్లి వైపు వేగంగా వస్తోంది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో లంకెలపాలెం కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ పడింది. దీంతో కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు తదితర వాహనాలు ఆగాయి. అతివేగంగా వస్తున్న బొగ్గు లారీ సిగ్నల్ పాయింట్ వద్ద అదుపు తప్పి నిలిచి ఉన్న ఓ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఆ ట్రాక్టర్ పైకి ఎగిరిపడి ఓ కారుపై పడింది. ఈ క్రమంలో మరో కారు, రెండు ఆటోలు, రెండు బైక్‌లు, లారీని బొగ్గు లారీ ఢీకొట్టుకుంటూ ముందుకు వెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో ఆ వాహనాలన్నీ దెబ్బతిన్నాయి. బొగ్గు లారీ ముందు భాగం, విద్యుత్ స్తంభాలు, రెయిలింగ్ ధ్వంసమయ్యాయి. దెబ్బతిన్న వాహనాల్లో ప్రయాణిస్తున్న 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. బొగ్గు లారీ డ్రైవర్ నీరజ్‌లాల్, చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన కె.వెంకటరమణ, అగనంపూడికి చెందిన డి.శ్రీనివాసరాజు పరిస్థితి విషమంగా ఉంది. చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన సంతోష్, అగనంపూడికి చెందిన చెందిన పల్లా శ్రీను, జి.హర్ష, జి.కొండయ్య, గాజువాకకు చెందిన బి.శరణ్య తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి తలకు గాయాలవ్వగా.. మరికొందరి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. క్షతగాత్రులను హుటాహుటిన 108 అంబులెన్స్‌లో అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా డి.శ్రీనివాసరాజు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన ప్రస్తుతం పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బొగ్గు లారీ బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శ్రమించిన పోలీసులు

నిత్యం రద్దీగా ఉండే లంకెలపాలెం కూడలిలో ఈ ప్రమాదం జరగడంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. అక్కడే ఉన్న పరవాడ ఎస్ఐ సిరపరపు సురేష్ సిబ్బందిని అప్రమత్తం చేసి.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. ధ్వంసమైన వాహనాలను క్రేన్ సాయంతో అక్కడి నుంచి తొలగించారు. లారీ కింద చిక్కుకున్న వాహనాలను తీయడానికి పోలీసులు శ్రమించారు. ప్రమాద కారణంగా జాతీయ రహదారిపై 2.30 గంటల పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రయాణికులు, వాహనచోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. వాహనాలను ఫ్రీలెఫ్ట్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మధ్యాహ్నం 3 గంటలకు ట్రాఫిక్ సమస్య తీరడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.









ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు

క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ


గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవలో భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 190వ ఊంజల్ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిల నేతృత్వంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపారవేత్త కర్రి వీరవెంటక సత్యనారాయణమోహన్ లక్ష్మీలావణ్య దంపతులు కుటుంబ సమేతంగా ఊంజల్ సేవ జరిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీ గౌరీ పరమేశ్వరి అమృతవర్షిణి ప్రతినిధి పెతకంశెట్టి సుజాత పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు

కశింకోట: వివాదాలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు స్థానిక నాయకులు, పెద్దలు, ప్రజలు సహకరించాలని సీఐ ఎం.వినోద్‌బాబు కోరారు. మండలంలోని తీడ గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామ సభ నిర్వహించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలన్నారు. నియమావళిని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన, ఎంపీడీవో శేషుబాబు, ఎస్ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

కశింకోట: మండలంలోని అచ్చెర్లలో 9 మద్యం సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఎస్.మల్లేశ్వరి అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుందన్న సమాచారం మేరకు దాడి చేసి, పట్టుకున్నామన్నారు. ఆమెను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 3,227 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,710	4,410
మొదటి రకం	3,520	4,150
రెండో రకం	3,410	3,780
మూడోరకం	3,290	3,510

అనకాపల్లి సినిమాలు

గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి) : సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్ : సత్యనారాయణస్క్రీన్-2
ఓం భీం బుష్ : షిర్డిసాయి
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి) : పర్తిసాయి
ది గోట్ లైఫ్ : వెంకటేశ్వర
కలియుగ పట్టణంలో: శ్రీసత్య
టిల్లు స్క్వేర్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-17 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 295 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 204 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



తుమ్మపాల.. అభివృద్ధిలో భళా!

- రూ.11.40 కోట్లకు పైబడి అభివృద్ధి పనులు
- అంతే మొత్తంలో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన గ్రామ స్వరూపం


కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం

దశాబ్దాల తరబడి తుమ్మపాల గ్రామం అభివృద్ధికి ఆమడ దూరం. మేజర్ పంచాయతీ అయినప్పటికీ.. గొప్పగా చెప్పుకునే అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. గత ప్రభుత్వంలో మాటలు తప్ప, చేతల్లో ఒక్కటీ అమల్లోకి వచ్చిన దాఖలాల్లేవు. ఐదేళ్ల క్రితం ఊరుదాటిన వ్యక్తి, ఇపుడు ఊర్లోకి వస్తే.. కోమాలో నుంచి పాతికేళ్ల తర్వాత బయటపడ్డానా! అన్న ఆశ్చర్యం కలుగుతుందంటే అతిశయోక్తి కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తుమ్మపాల గ్రామ పంచాయతీ అభివృద్ధి ఆ స్థాయిలో జరిగింది.


విస్తరణ, అభివృద్ధి తర్వాత ప్రధాన రహదారి

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ గత ఐదేళ్లలో శరవేగంగా అభివృద్ధి చెందింది. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పంట కాలువ, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, స్కూళ్ల అభివృద్ధి ఇలా ప్రతి అంశంలోనూ అభివృద్ధి జరిగి, గ్రామం రూపురేఖలో మారిపోయాయి. జిల్లాలో అత్యధిక జనాభా గల పంచాయితీలో ఇదొకటి. వ్యవసాయం పాడిపరిశ్రమపై ఆధారపడే గ్రామం కావడంతో రైతు బాంధవుడు సీఎం జగన్ పాలనలో వీరికి అవసరమైన అన్ని వసతులూ గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయి.

మౌలిక వసతుల్లో మేటి

అనకాపల్లి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తుమ్మపాల గ్రామం ప్రధాన రోడ్డును అభివృద్ధి చేశారు. గ్రామంలో వీధులన్నింటినీ సీసీ రోడ్లుగా తీర్చిదిద్దారు. సిమెంట్ కాలువలు నిర్మించారు. నాడు-నేడులో స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు, మూడేసి చొప్పున సచివాలయ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లు, వెల్‌నెస్ సెంటర్లు, ఓ పశువుల ఆస్పత్రి, రెండు శ్మశాన వాటికలు, ఇంటింటి కుళాయిలు ఇలా ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతుల్నీ ఏర్పాటు చేశారు. అంతే స్థాయిలో సంక్షేమ పథకాల లబ్ధినీ అందుకున్నారు. దీంతో ఇబ్బందుల్లేకుండా ఆనందంగా ఉన్నారు.


అభివృద్ధికి నోచుకున్న అంగన్‌వాడీ కేంద్రం


పునరుద్ధరించిన తుమ్మపాల నుంచి పంట పొలాలకు వెళ్లే సాగునీటి కాలువ

వ్యవసాయం లాభసాటి

గ్రామంలో రైతులే ఎక్కువ. పక్కనే శారదానది ఉండటంతో సాగునీటి ఇక్కట్లు చాలా తక్కువ. సుమారు 3 వేల ఎకరాల్లో వరి, కూరగాయలు, అపరాలు, చిరుధాన్యాలు సాగు చేస్తుంటారు. ఆర్బీకేల రాకతో వీరికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, సాగులో సలహాలు, సూచనలు, గిట్టుబాటు ధరకు పంట సేకరణ జరుగుతోంది. పశుపోషణ కూడా ఎక్కువే. సీఎం జగన్ పాలనలో అమూల్ రాకతో పాడి శ్రమపై ఆధారపడ్డ రైతులు అధిక మొత్తంలో లాభాలనార్జిస్తున్నారు. శారదానదీ పరివాహక ప్రాంతాల్లో దొరికే రుచికరమైన చేపల కోసం అనకాపల్లి పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు కూడా తుమ్మపాల వస్తుంటారు.

తుమ్మపాల గ్రామ వివరాలు

జనాభా 30,846
ఓటర్లు 22,363
గృహాలు 5,142

ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలు

సీసీ రోడ్లు(దాదాపు 8 కి.మీ.)	రూ.2 కోట్లు
డ్రైనేజీలు	రూ.2 కోట్లు
నాడు-నేడులో స్కూళ్ల అభివృద్ధి	రూ.2 కోట్లు
అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి	రూ.15 లక్షలు
మూడు ఆర్బీకే భవనాలు	రూ.84 లక్షలు
మూడు వెల్‌నెస్ సెంటర్ల వ్యయం	రూ.65.40 లక్షలు
మూడు సచివాలయ భవనాలు	రూ.1.10 కోట్లు
దేవాలయాలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి	రూ.50 లక్షలు
రెండు శ్మశాన వాటికల అభివృద్ధి	రూ.15 లక్షలు
ఇంటింటి కుళాయిలకు కేటాయింపులు	రూ.2 కోట్లు

బాగా అభివృద్ధి చేశారు



గతంలో తుమ్మపాల మెయిన్ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించేవాళ్లం. గ్రామంలోని రోడ్లు, మురుగు కాలువల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక ఈ మూడేళ్లలోనే గ్రామం పూర్తిగా మారిపోయింది. పక్కా రోడ్లు, సిమెంట్ కాలువలు నిర్మించారు. ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిలో వందో వంతు కూడా గతంలో ఏ ప్రభుత్వాలూ చేయలేదు.

– ఆదారి ప్రసాదు, తుమ్మపాల

ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే..



ఒకప్పుడు ప్రభుత్వ పరంగా ఏ పని కావాలన్నా అనకాపల్లి వెళ్లాల్సి వచ్చేది. ఇపుడా పరిస్థితి లేదు. అన్ని ప్రభుత్వ సేవలూ మా ఊర్లోనే అందుతున్నాయి. గత ఎన్నికల ముందు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేస్తానని జగన్ చెప్తే.. ఏంటో అనుకున్నాం. దాని ఉపయోగం ఇపుడు బాగా తెలిసింది. ఊరు దాటాల్సిన పనిలేకుండానే.. మా అవసరాలన్నీ చాలా వరకు వలంటీర్ల ద్వారానే జరిగిపోతున్నాయి. ఇంత గొప్ప పాలన అందిస్తున్న జగన్‌కు కృతజ్ఞతలు.

– పి.సత్తిబాబు, తుమ్మపాల

వైఎస్సార్‌సీపీలో జనసేన యువత చేరిక


ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన యువకులు

కశింకోట: తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మరింత కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఏఎస్ పేటలోని తన నివాసంలో అనకాపల్లి మండలం సంపతిపురానికి చెందిన జనసేన యువత పవన్ కుమార్, గణేష్, శ్రీను, ఫరీద్, సాయి, ప్రదీప్, దుర్గ, రాము, మణికంత, యువశంకర్, నవీన్, ఈశ్వర్, కృష్ణ, ఆదర్శ్, నాగరాజు తదితర 20 మంది తమ అనుచరులతో కలిసి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కల్లపల్లి లోవరాజు, బొద్దపు పవన్, కల్లపల్లి ఈశ్వరరావుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి భరత్‌కుమార్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీకి అడుగడుగునా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని యువకులను సూచించారు.

అప్రమత్తంగా ఉండండి -ఎస్పీ


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

పరవాడ: అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. డబ్బు, మద్యం, నాటుసారా, గంజాయి, ఉచిత కానుకలు వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర పోలీసు దళాలు, పోలీసులను ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. ఎస్పీ వెంట సీఐ బాలసూర్యారావు ఉన్నారు.

వేడుకగా నూకాంబిక పుట్టుక ఉత్సవం


అమ్మవారి పాదాలు, గరగలను రిక్షాపై ఊరేగిస్తున్న దృశ్యం


భక్తుల పూజలందుకున్న అమ్మవారి పాదాలు, గరగలు

కశింకోట: స్థానికంగా ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి పుట్టుక ఉత్సవం గురువారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య ఉత్సవాలకు అంకురార్పణగా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి పాదాలు, గరగలను అలంకరించిన రిక్షాపై నిలిపి డప్పులు, వాయిద్యాలతో గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ప్రజలు దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం పాదాలు, గరగను అమ్మవారి ఆలయంలో నిలిపారు. ఉత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వేగి రమణబాబు, వేగి రామరాజు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


కశింకోటలోని గవరపేట ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు


ఆంధ్ర కల్వరి సెంటినరీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కశింకోట: మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. శిలువ వేసినప్పుడు ఏసుక్రీస్తు చేసిన ఏడు ప్రవచనాలను పాస్టర్ సన్నీజేమ్స్ స్తుతించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షుడు మోజెస్, కార్యదర్శి నాగేశ్వరరావు, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్ పాల్గొన్నారు.

- గవరపేట చర్చిలో ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం పాస్టర్ వై.సునీల్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు ప్రవచనాలను వివరించి, వాటిని ఆచరించాలని సూచించారు.
- స్థానిక షాలెం మందిర్, బయ్యవరం, కొత్తపల్లి, తేగాడ, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, నరసింగబిల్లి, సోమవరం, నూతలగుంటపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జమాదులపాలెం తదితర గ్రామాల్లోని చర్చిల్లో కూడా గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైఎస్సార్ బీమా అందజేత

పరవాడ: కారు ప్రమాదంలో మరణించిన ఈ.బోనంగి గ్రామానికి చెందిన ఈత భాస్కరరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం అందజేశారు. వైఎస్సార్ బీమా పథకంలో ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని మృతుడి భార్య గ్రామ వలంటీర్ ఈత లక్ష్మి(నవీన) శుక్రవారం తెలిపింది. తన భర్త భాస్కరరావు జనవరిలో రాజమహేంద్రవరం నుంచి కారులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని చెప్పింది. తనకు ఇద్దరు కుమారులు, అత్త ఉన్నారని, వలంటీర్‌గా పనిచేస్తూ ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నట్లు వెల్లడించింది. గ్రామంలో గృహసారథిగా పనిచేస్తున్న తన భర్త భాస్కరరావు కారు ప్రమాదంలో మరణించగా.. వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసి నేరుగా తన బ్యాంక్ అకౌంట్‌లో జమచేసిందని లక్ష్మి చెప్పింది. బీమా పరిహారం అందించి తన కుటుంబానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. బీమా సౌకర్యం కల్పించడానికి దోహదపడిన రాష్ట్ర జేసీఎస్ కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.



భర్త భాస్కరరావు, పిల్లలతో వలంటీర్ లక్ష్మి(ఫైల్)

అభివృద్ధి, సంక్షేమానికే మా ఓటు


అంజయ్యకాలనీలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ను దీవిస్తున్న వృద్ధురాలు


ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మలసాల భరత్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో ప్రజల అభిప్రాయం
- జోరుగా ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ప్రచారం

అనకాపల్లి: ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం అమలు చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు అడిగే హక్కు ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధి అంజయ్యకాలనీలో కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత స్థానికంగా ఉన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని గడప గడపకూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. దేశ చరిత్రలో తన పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాల్సిందిగా అడిగిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. 2019 సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కరోన విపత్తు సమయంలో ప్రపంచం అతలాకుతలం అయి, రాష్ట్రంలో ప్రభుత్వానికి ఆదాయం లేకపోయినా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను సకాలంలో అందించిన విషయాన్ని గుర్తుచేశారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ పాలనలోనే అమలయిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే అందించామన్నారు. పేదవాడి వైద్యం కోసం గతంలో ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన గొప్ప ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని కొనియాడారు. పేదలు అనారోగ్యంతో బాధపడి ఆరోగ్యశ్రీలో చికిత్స అందుకున్న తర్వాత కోలుకునేంత వరకు వారి ఖర్చుల నిమిత్తం రోగి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేస్తున్న సీఎం జగన్ కాకుండా మరొకరున్నారా? అని ప్రశ్నించారు. పేదల పిల్లలు మంచి వాతావరణంలో అత్యుత్తమ విద్య అందుకోవాలనే ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మిగిలిన పార్టీలు కూటమిగా ఏర్పడి బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతిని అడ్డుకునేందుకు పన్నుతున్న కుట్రల్ని తమ ఓటుతో అడ్డుకోవాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు ఆకుల సంతోష్, అల్లు మల్ల జయరాం, కె.రవీంద్రనాథ్, కోడూరు అప్పారావు, సంబారి అప్పారావు, బుద్ధ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ వేడుకల్లో మలసాల

కశింకోట: మండలంలోని చింతలపాలెం మసీదులో గురువారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు ఆయన్ని సాదరంగా ఆహ్వానించారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. మసీదు కమిటీ ప్రతినిధి బాబూరావు, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఎస్.రాయవరం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి జరగనున్న పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు మండలంలోని పెదగుమ్ములూరు హైస్కూల్‌లో శనివారం నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పీఆర్టీయూ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. వచ్చేనెల 26 వరకు కోచింగ్ ఉంటుందన్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పీఆర్టీయూ ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సమకూరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

13 మంది జూదరుల అరెస్ట్

- వారి నుంచి రూ.37,130 స్వాధీనం

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల శివార్లలో గుల్లాట, పేకాట, ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న స్థావరాలపై దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.37,130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివరాలు.. మల్లునాయుడుపాలెం శివారు ప్రాంతాల్లో లూడో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నట్టు సమాచారం అందడంతో గురువారం రాత్రి దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అమృతపురం శివార్లలో శుక్రవారం గుల్లాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎ.శిరసపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు శుక్రవారం వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి 6గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన 13 మందిని అనకాపల్లి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

వేసవిలోనూ శారదా నదిలో నీరు


దిమిలి వద్ద శారద నదిలో ప్రవహిస్తున్న నీరు

రాంబిల్లి: వేసవికాలంలోనూ శారదా నదిలో నీరు ప్రవహిస్తోంది. రబీ వరి పంట నూర్పులు ఇప్పటికే పలుచోట్ల పూర్తయ్యాయి. అక్కడక్కడ మరో వారం రోజుల్లో కోతలు, నూర్పులు పూర్తి కానున్నాయి. శారదా నదిలో నీరు ప్రవహించడంతో ఈ ఏడాది రబీ వరి సాగుకు ఇబ్బందులు తప్పాయి. వేసవి కాలంలోనూ నీరు ప్రవహిస్తుండడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను పొలాల్లో మేతకు తరలించినప్పుడు వాటికి తాగునీరు అందించేందుకు, వాటిని కడిగేందుకు శారదా నదిలో నీరు ఉపయోగపడుతుందని పాడి రైతులు తెలిపారు.